అవమానం

శ్రీ ఆకుండి నారాయణమూర్తి

కొత్తగా కాపరానికి వచ్చిన కోడలు లక్ష్మికి ఆయింటి ఆచారవ్యవహారాలు సమంగా అవగాహన కాలేదు మొదట్లో! భర్త ఆఫీసుకు వెళ్లినతరువాత, ఆ ఇంట్లో తనకు తోడుగా మరో వ్యక్తి లేకపోడంచేత, అత్తగారితోనే కాలక్షేపం చెయ్యవలసొచ్చేది లక్ష్మికి. తన పుట్టింటిలోమల్లే ఉంటుందని మొదట్లో అపోహపడిం దామె!

"ఏమండీ అత్తగారూ! నీళ్లు బిందెలోకి తోడేసి పొయ్యిమీద పెట్టేసే నండీ" ఆ యింట్లో పనిచెయ్యడానికి ప్రారంభించి మొదటిరోజున అంది.

"ఆ బాల్చీ, బోర్లించేసేవా?" అంది అత్త "రుద్రాక్షమ్మ".

"అయ్యో! మరచిపోయానండీ ... బోర్లించి వచ్చేస్తా", అని నూతిదగ్గరకు పరుగెత్తింది లక్ష్మి.

నీళ్లు తోడేసిన తరువాత బాల్చీ బోర్లించవలసిన ఆవశ్యకతేమిటో ఆమె కర్థంకాలేదు. ఆయింటి ఆచారం అదికాబోలని లక్ష్మి అనుకుంది. తను అనవసరంగా ఓ తప్పుపని ప్రారంభంలోనే చేసినందుకు ఎంతో భయపడింది. ఇంకా అలాంటి తప్పుపనులను ఎన్ని చెయ్యవలసొస్తుందో అని ఆమె హృదయం ఆరాటపడింది.

"పొయ్యి రాజేసేదా?" అని బాల్చీ బోర్లించివచ్చి అడిగింది.

"ఔనటే!...మీయింట్లో ఇలాగే చేసుకుంటారేమిటి? మొదట స్నానంచేసి ఆ తరువాత రాజెయ్యి" అంది రుద్రాక్షమ్మ.

లక్ష్మి గుండెలు గుభేలుమన్నాయి. ఓ మిలటరీ కమేండరులా అగుపించింది రుద్రాక్షమ్మ. పొయ్యి రాజెయ్యడానికి ముందు స్నానం చెయ్యడం అనేది ఆయింటిఆచారం కాబోలని అర్థం చేసుకుంది. ఓ గావంచా కట్టుకొని స్నానం చేసింది. పెట్టెలో ఉన్న ఓ నుడతచీర తీసి కట్టుకుంది. "ఇంక రాజెయ్యనా?" అని అడిగింది.

"ఓసి నీతెలివి బొగ్గులవా...అదేమిటే, మడిగా స్నానంచేసి, మైలబట్ట కట్టుకున్నావ్!...నువ్వింక పొయ్యిరాజేసినట్లే, నేవంట. చేసినట్లే! మీయింట్లో ఇలాగే నేమిటి చేసుకుంటారు" ఆశ్చర్యంతో అంది రుద్రాక్షమ్మ.

"అయ్యో, నాకంత బాగా తెలీదత్తగారూ!...అయితే మళ్లీ స్నానంచేసేదా?" అని అంది సగం భయంతో.

"ఊహుఁ...ఇవాళ్టికి నువ్వేమీ చెయ్యక్కర్లేదులే. మాటి మాటికీ స్నానంచేస్తే జబ్బుచేస్తుంది. నాలుగు రోజులపాటు నా దగ్గర తర్ఫీదుపొందేవంటే నాకన్నా ఆచారవంతురాల వవుతావు".

"నాలుగు రోజు లెందుకండీ! ... రెండు రోజుల్లో గ్రహించగలను".

"అదీ బుద్ధిమంతురాలి లక్షణం. అలా చెప్పేసమాధానాలు చురుకుగా, బాగా వుండాలి. చూడూ, పెద్ద కోడలుండే వట్టి మొద్దు! బెల్లం కొట్టిన రాయిలాంటిది. మూర్ఖత్వంకూడా కొంత ఉందిలే!"

"అయితే అత్తగారూ! ... అక్కయ్యగారూ, బావగారూ ఏ ఊళ్లో ఉంటున్నారండీ!"

"అబ్బ, ఆ ఊరుపేరేనాకు జ్ఞాపకం ఉండదే....ఏమిటిచెప్మా..."ఆయిదిగో మో" కాశీ వెళ్లేవారిలో ఉందిట.

"అంతదూరం ఎందుకు వెళ్లిపోయారండీ".

"ఏమిటో, వాడో పిచ్చిమనిషి...ఏదోనీ పెళ్లప్పుడు మీయింటికి రావడమే! అక్కణ్ణించి, ఇప్పటివరకూ రావడమే మానీసేడు ఆ వెధవూళ్లో ఏమి సౌఖ్యంగా ఉంటుందని అక్కడికి పోయేడు. ఒక మైలా అంటూ, ఆనేవిచక్షణ వుంటేగా వాడికి. ఇంతకీ దాన్నించే వాడలా తయారయేడు.

"ఆదేశాల్లో అందరూ అంతేనండి. మైల బట్టలతోనే భోంచేస్తారు."

"చూసేవా వెధవలు!...పాడవకేంచేస్తారు బ్రాహ్మణ్యాన్ని తగలపెట్టేస్తున్నారు. మరి లేకపోతే ఈకరువులూ, ఈయుద్ధాలూ ఎందకొస్తున్నాయంటావు?"

"పెద్దల నియమాలను, నిష్ఠలను సమంగా పాటించలేదని."

"అదీ చిన్నదానివయినా నీకే బాగా తెలుసు" అంది రుద్రాక్షమ్మ.

ఇంతలో లక్ష్మి భర్త కామయ్య వచ్చే డక్కడికి. కాళ్లు కడుక్కోమని చెంబుతో నీళ్లు తెచ్చింది లక్ష్మి. కోడలు గ్రహింపు శక్తిని చూచి ఎంతో ముచ్చటపడింది రుద్రాక్షమ్మ.

"మా అమ్మ చెప్పిందా? ఇలా తెమ్మనమని" నవ్వుతూ అడిగేడు కామయ్య.

"లేదు. ఈయింటి ఆచారవ్యవహారాలను ఇప్పుడిప్పుడే అవగాహనచేసుకుంటున్నాను" అంది నవ్వుతూ.

"చూసేవురా అబ్బాయీ!...మీ వదిన లాంటి దనుకున్నా వేమిటిది. చెప్పినపని చటుక్కున గ్రహించి చేస్తుంది" అంది తల్లి రుద్రాక్షమ్మ.

కామయ్య చిరునవ్వు నవ్వేడు. "ఏదో మొత్తానికి ఇదికూడా అత్తగారయేవేళకి నీకన్నా రెండాకులు హెచ్చు చదువుకొనేటట్టు చెయ్యి"అన్నాడు తల్లిని సంబోధిస్తూ.

"నాకోడలు నాఅంత దవుతే నాకంత కన్నా ఏంకావాలి నాయనా! నాకు కూతురు లేనిలోపమే తీరిపోతుంది"

"ఓ! రేప్పొద్దున్న దీనికీ పిల్లలు పుడితే. రోజుకి నూరేసి మాట్లు స్నానం చేయించేస్తుంది మడీ! మడీ అంటూ."

"నీకూ పెద్దవాడి పోలికలు లేక పోలేదు." అంటూ వంటింటిలోకి వెళ్లిపోయింది రుద్రాక్షమ్మ.

"ఔనే లక్ష్మీ!...ఇవాళ ఎన్నిమార్లు స్నానంచేసేవు?" అని అడిగేడు కామయ్య.

"ఇహఁ ... ఊరుకుందురూ. అత్తగారికి కోపంవస్తుంది." కనుబొమలు ముడుస్తు, అదో రకంగా నవ్వుతూ అంది లక్ష్మి.

"ఊహుఁ... చెప్పు. ఫరవాలేదులే."

"ఒక్కమారు—"

అంతట్లో "ఒరేయి నాయినా, ఆ పొయ్యి

...గాది నీళ్ళు పోసేసుకొని, ఓ చేదడు చన్నీళ్ళో శుద్ధయి, మడికట్టుకొనిరా!" అని తల్లి పిలుపువినబడింది వంటింట్లోంచి.

"వెళ్లండి" అంటూ గోడవారకుపోయి నవ్వడం మొదలుపెట్టింది లక్ష్మి.

"ఎందుకు నవ్వుతున్నావు?" అని అడిగేడు కామయ్య.

"చెప్పను."

"నాకు తెలుసునులే."

"చెప్పండి చూద్దాం?"

"నేను చెప్పను." ఇద్దరూ పకాలున నవ్వుకున్నారు.

"మా అమ్మ అచారం గు రిం చే గా!" అన్నాడు కామయ్య.

"ఇష్.. భోజనానికి మడికట్టుకోండి." అంటూ పెరట్లోకి వెళ్లిపోయింది లక్ష్మి, నీళ్లు తోడిద్దామని.

*   *   *   *

మధ్యాహ్నం ఒంటిగంట అయేసరికల్లా ఇళ్ళు చక్కబెట్టుకొని ఆపీధి అమ్మలక్కలందరూ, రుద్రాక్షమ్మగారి గుమ్మంలో సమావేశమవడం అనుదినకార్యక్రమాలలో ఒకటి!...విస్తరంటలు కుడుతూనో, లేక బొంతలు కుడుతూనో కూర్చుంటూ ఉండే వారు. వాళ్ల సమావేశంలో చర్చించనివిషయం అంటూలేదు. భగవంతునిసృష్టిలో జరిగేయ విషయాలన్నీ వాళ్లవే అన్న భావంలో వుండే వారు. అజట్టులోకల్లా న ర స మ్మ గా రి ది ప్రముఖస్థానం. ఎక్కడలేని విషయాలనూ సేకరించే దో విశేషరీలా ! ... తీవ్రమయిన తీర్మానాలను వాటిమీద పాస్‌చేసేది. నరసమ్మ గారంటే ఆవీధి అమ్మలక్క లందరికీ హడల్! . ఆమెకెదురు తిరిగి ఎవరయినా మాట్లాడేరా అంటే చచ్చినంత కలకానే రన్నమాటే.

ఒకరోజున ఏదో మాటలసందర్భంలో . . "రుద్రాక్షమ్మగారున్నారూ అంటే,...అవిడిది ఆచారం—అలా వుండాలి," అనీ, అంది నరసమ్మ.

"మాచేరటండీ, వీళ్ల వీరకత్తెగారింట్లో, అంతా కాపకూడేనట!" అంది పొరిగింటి కామాక్షమ్మ.

"ఔనట!...బొత్తిగా ఆచారం లేదట!—పైలా, అంటూ, కాప, మాల అన్న భేదమే లేదట!— మాసి, చూసి అలాంటి సంబంధం చేసేరేమిటో!" అని నరసమ్మ ఓ ఘాటయిన రిమార్కు పాస్‌చేసింది.

రుద్రాక్షమ్మ విని సహించలేకపోయింది. "వాళ్ల సంగతి మీఅందరికీ మహా తెలిసిపోయి నట్లు...వాళ్లకున్న ఆచారంలో సగమయినా మీరు పాటిస్తున్నారేమిటి? మాటలూరికే దండగ చేసేస్తారేం!" అంది రుద్రాక్షమ్మ.

"ఓహో—'అయ్యవారేం చేస్తున్నారూ అంటే చేసినతప్పుల్ని దిద్దుకొంటున్నారు' అన్నట్లుంది మీమాటల తీరు. తెలిసో, తెలియకో ఆసంబంధాన్ని చేసేరు పిల్ల బాగుంది కదా అని. పైవిషయములుచూడక అందు కిప్పుడుదాన్ని సమర్థిస్తున్నారు" అంది నరసమ్మ.

"ఊరుకోండి. ఎక్కడలేని విషయాలూ మీకే కావాలి. ఒకర్ని చులకనగా దూషించడమే కానీ మీవిషయమై మీరాలోచించుకోరు. గురివిందగింజ తన మచ్చ చూచుకోదట. అలా వుంది మీసంగతి" రుద్రాక్షమ్మ కొంచెం కోపంతో అంది.

"ఇది మరీ బాగుంది. మీకోడలు లక్ష్మి చెప్పింది, నాతో తనపుట్టింటారిసంగతినంతా. లేకపోతే నాకేం తెలుస్తుంది. "అబ్బ...ఏమిటండీ మాఅత్తగారిచాదస్తం... భరించలేం! ఎంతపుణ్యం ఆర్జించేద్దామనో ఆమె వుద్దేశం, ఇంకా పూర్వాచారాలమీద నమ్మకం పోలేదామెకు. మా యింట్లో మేం శుభ్రంగా కాపవానిచేతే నీళ్లు తెప్పించేసుకుంటాం. కూరలుంతరగడం, పచ్చళ్లు చెయ్యడం మొదలయిన పనులన్నీ మాకాపదానిచేతే చేయించేసుకుంటాం." అని మీకోడలే నాతో మొన్న అంది. లేకపోతే నాకేం తెలుస్తుంది" విస్తరంటలను, విసురుగా దొంతరపెడుతూ అంది నరసమ్మ.

"మాలక్ష్మి అలా అందంటే నేన్నమ్మను. అది అలాంటి మనిషి కాదసలు. నేనంటే దానికెంతో అభిమానం! - చెప్పిన పనిని చటుక్కున చేసేస్తుంది. నన్ను ఓ తల్లిలా భావిస్తున్నాదది" అంది రుద్రాక్షమ్మ.

"ఔను. ఇప్పుడు మీతో అబద్ధాలు చెప్పకపోతే నాకు కాలం గడవదని కాబోలు మీ అభిప్రాయం."

"కొందరి లాంటి లేనిపోని విషయాలను పుట్టిస్తూ ఉంటారులెండి!"

"ఇంతకీ. మీయింటి గుమ్మంలోకి వచ్చినందుకు ఇన్ని మాటలు పడవలసొచ్చింది. నిజమాడితే నిష్ఠూరం!...కావలిస్తే మీలక్ష్మినే అడగకూడదూ."

"ఒసేయి!...లక్ష్మి, - ఏంచేస్తున్నావు?- ఓమారిలా రా!" అని పిలిచింది రుద్రాక్షమ్మ.

"ఏమండత్తా," అని సగం అల్లుతున్న లేసు గుడ్డతో పరుగెత్తు కొచ్చింది లక్ష్మి.

"ఏమేవ్!—మొన్న నువ్వు మీ పుట్టింటి గురించీ, మీ అత్తగారి ఆచారంగురించీ నాతో ఏమని చెప్పేవే?" అని అడిగింది నరసమ్మ.

అధికాహారోత్పత్తి ఉద్యమాన్ని గురించిన ఒకానొక భావోత్తేజకమైన పోస్టరు చిత్రాన్ని పరిశీలనగా పరికిస్తున్న ఆహారవ్యవసాయమంత్రి క. యం. మున్షీ గారు.

లక్ష్మిగుండెల్లో రాయిపడింది. నరసమ్మ ఇంత పేచీకోరుమనిషని అనుకోలేదామె. ఏదో మంచిమనిషనుకొనే, తన స్వవిషయం గురించి, అత్తగారి ఆచారవ్యవహారాలగురించి నరసమ్మతో ముచ్చటించిన మాట నిజం. కానీ నిజం చెప్పితే అత్తగారేమనుకుంటారో అసత్యం చెప్పితే ఏమి ముప్పు వాటిల్లుతుందో ఇంతకీ తను నరసమ్మతో అన్నమాటల్లోతప్పేముంది?...తన పుట్టింటారింటిలో "ఆచారం" అనేపదానికి తావులేదన్న సంగతి అత్తగారికి బాగానేతెలుసు. అంచేత ఆమాట ఎవరితో చెప్పినా తప్పేం? ఇంక తన అత్తగారు ఆచారవంతురాలని ఎవరితో అన్నా తప్పేం? అందులో అబద్ధముందా? ఈ రెండు విషయాల గురించేకదా, నరసమ్మతో తను ముచ్చటించింది. లక్ష్మిఆలోచనలు పరిపరివిధాల పోయేయి.

"ఏమన్నావు. చెప్పు?"అని అత్తగారంది తను ఆ విషయాలేమీ నరసమ్మతో అనలేదని కోడలు చెపుతుందని రుద్రాక్షమ్మ ఆశ. ఎలాగయినా నలుగురి మధ్యా తన మాట నెగ్గించుకొందామని రుద్రాక్షమ్మ కోరిక!-కోడలు నిజంగా నరసమ్మతో ఆవిషయాలన్నీ అన్నప్పటికీ 'అనలేదు' అనే అబద్ధంచెప్పేస్తే బాగుండునని అనుకుంది. రుద్రాక్షమ్మ. నలుగురి మధ్యా నరసమ్మ పట్టి పేచీకోరు. అని ఋజువుచేద్దామని రుద్రాక్షమ్మ కోరిక! అంతే!...కోడలి పుట్టింటారి ఆచారవ్యవహారాలు ఎలాగుంటాయో ఆమెకు బాగా తెలుసు. కోడలు ఆమాటలు అనడంగూడా సమంజసమే!-అందువల్ల తప్పు లేదనికూడా సమర్థించుకుంది. కాని ఆ క్షణంలో మట్టుకు అబద్ధం ఆడితేనే!...

కానీ, రుద్రాక్షమ్మ అనుకున్నట్లు మాత్రం జరగలేదు. నరసమ్మ చెప్పినట్లు తను అన్నానని ఒప్పేసుకుంది లక్ష్మి.

'ఇప్పటికి బోధపడిందా?' అంటూ విస్తరంటలు పట్టుకొని గబగబా నడక సాగించింది నరసమ్మ.

* * * *

లక్ష్మి కాపరంలో తుపాను చెలరేగింది. కోడలు తన్ని అందరి మధ్యా అవమానపరచిందని రుద్రాక్షమ్మ ఆగ్రహం!...ఏదో మిష పెట్టి కోడలిని తిట్టనిరోజంటూ లేదు. కొడుకు ఆఫీసునుంచి ఇంటికి వచ్చేసరికి ప్రతిరోజూ ఏదో ఓ రిపోర్టు కోడలిమీద జారీ చేస్తూవుండేది. అటుచూస్తే తల్లి, ఇటు చూస్తే అమాయకురాలయిన భార్య!... వీళ్లలో ఎవరిని ఏమనగలడు. అనవసరంగా రేగిన ఈ వ్యర్థకలహాలనుంచి కామయ్య మనస్సు పూర్తిగా పాడయింది. ఎటొచ్చీ భార్యనుమట్టుకు మందలిస్తూ ఉండేవారు. "ఔనుగానీ, మా అమ్మఆచారవిషయమై, ఆ నరసమ్మతో ఎందుకు చెప్పేవు? అది పట్టి పేచీకోరుమనిషి కదా." అన్నాడు కామయ్య.

"తప్పుపనే చేసేనని ఇప్పుడు గ్రహించాను. కానీ అనవసరంగా అత్తగారికి నామీద కోపం వచ్చేసింది". అందిలక్ష్మి.

"ఔను. ఆ పరిస్థితిలో ఎవరికయినాసరే కోపం రావడం సహజం. సరే!-అమ్మ ఏమయినా నిన్ను అన్నప్పటికీ, అనవసరపు జవాబులు చెప్పక, నీమానాన నువ్వు నీపని చూసుకుంటూ ఉండు."

"అలాగే"

"అన్నట్టు చెప్పడం మరిచా- మా అన్నయ్య వదినా ఇవాళ సాయంకాలం రైల్లో వస్తారట! రైలుదగ్గరకు రావలసిందని ఉత్తరం వచ్చింది.'

"నిజం!...అత్తగారితో చెప్తా" అంటూ నట్టింటిలోకి పరుగెత్తికది లక్ష్మి. ఆ తొందరలో గుమ్మందగ్గర వున్న పాలగిన్నె నుతన్నేసింది.

"అయ్యో, తన్నేసేవూ? ఎందుకా మిడిసిపాటు?-శనిదేవతవు. ఎలా అయితేనేం దాపరించే వీ కొంపకి' అంటూ తిట్టడం మొదలు పెట్టింది. రుద్రాక్షమ్మ.

"చూసుకోలేదండీ!... ఇవాళ సాయంకాలం రైల్లో అక్కయ్యగారూ, బావగారూ వస్తారట!...ఆ విషయం చెపుదామని వస్తూ తొందరలో..."

"ఏం?...కళ్లు లేవేమిటి?...ఇంక వాళ్లమీద మహా అభిమానం కొర్లుకొచ్చినట్లు. ఏదోరకంగా ఇల్లు గుల్ల చేసి వెళ్ళు మహాతల్లీ! నువ్వేం తక్కువదానివా? తేనెపూసిన కత్తి."

లక్ష్మి బిక్కచచ్చిపోయింది. మరేమాటా అనలేదు. గోడవారకు పోయి తల వంచుకొని నిలబడింది. కళ్లలో నీరు గిరగిర్రా తిరిగింది. కానీ ఏడవడానికి సాహసం లేకపోయింది.

"నీకు చాకిరీ చెయ్యడానికి నేనున్నాను కదూ? అదేనా నీధైర్యం ఏభై యేళ్లదాన్నయినా నా కింకా సుఖం లేదు. ఇదంయ నా కర్మ" గొణగడం మొదలు పెట్టింది రుద్రాక్షమ్మ.

నూతిదగ్గరకు గబగబా వెళ్లింది లక్ష్మి. స్నానంచేసి వంట ప్రారంభిద్దామని. మళ్లీ అత్తగారి గొంతుక వినిపించింది. "హాయిగా ఆ పెద్దకోడలే తెలివి. ఆచారం లేదన్న మాటే గానీ, దీనిలాంటి కుళ్ళుబుద్ధు లేమీ లేవు ఎప్పటికయినా అదే నాకు చేసిపెట్టేది. అని.

చేదడునీళ్ళు పైన పోసుకుంది లక్ష్మి. అంతవరకూ ఆపుకున్న కళ్లనీళ్లు ఆ నీళ్లతో కలసిపోయాయి.

"ఎంతసేపలా నీళ్ళు పోసుకుంటావు? మళ్లీ అత్తగారిగొంతు.

"అయిపోవచ్చింది, వచ్చేస్తున్నా. తొందరలో రావడంవల్ల నట్టింటిలో గో వారనున్న పట్టెమంచం తగిలింది.

"అయ్యో, నీమడి తగలడ!...ఏం పోయే కాలమే యిది. ఇవాళ మరి మమ్మల్ని అన్నం తిననివ్వ వేమిటి? పిశాచలాం పీక్కుతింటున్నా వేమిటే?"

మరేం మాట్లాడలేదు లక్ష్మి. మళ్లీ నూతి దగ్గరకు పరుగెత్తింది. మళ్లీ స్నానంచేసింది ఆరోజున ఎలాగో వంట చేసింది.

* * * *

ఆ సాయంకాలం రైల్లో తోటికోడలు బావగారూ వచ్చారు. తనకు సహాయకారిగ తోటికోడలు ఉంటుందని లక్ష్మి మొదట్లో ఆశపడింది. కానీ తను అనుకున్నట్లు జరగ లేదు. ఆచారం మానేసి తనలాగే మసలమని లక్ష్మికి హితోపదేశం చేసింది తోటికోడలు కమల. అందుకు ఒప్పుకోలేదు లక్ష్మి. తను చెప్పినట్లు వినలేదనే ద్వేషంచేత, లక్ష్మిమీద కక్షగట్టింది కమల. అగ్నిదేవుడికి వాయుదేవుడు సహాయపడ్డట్లు, లక్ష్మిని బాధలు పెట్టడంలో రుద్రాక్షమ్మ, పెద్దకోడలూ ఏకమయేరు.

రోజులు గడుస్తున్నాయి!...రోజులతో పాటు లక్ష్మిజీవితంలో విషాదరేఖలు వెల్లివిరిసిపోతున్నాయి!- ఆ ఇంట్లో ఉండడం ఓ నరకంలో ఉన్నట్లనిపించేది లక్ష్మికి మానసికంగా లక్ష్మి ఎంతో బాధపడుతున్నాదన్న సంగతి కామయ్యకు తెలుసు. "మీ పుట్టింటికి కొన్నాళ్ళక్కడ ఉండకూడదూ?" అన్నాడు కామయ్య లక్ష్మితో.

"అలాగే, ఆలోచించి చెప్తా." అంది లక్ష్మి.

కాని, ఆ విషయమై ఆట్టే ఆలోచించవలసిన అవశ్యకత తప్పిపోయింది లక్ష్మికి. కొన్నాళ్లపాటు, 'గోమో' వచ్చి తనదగ్గర ఉండమని తల్లిని కోరేడు పెద్దకొడుకు.

(35వ పేజీ చూడుడు)

అవమానం

(19-వ పేజీ తరువాయి)

వంటా, ఆరకమయిన పనులగురించి తనకు పూచీ తప్పిపోతుందికదా. అని పెద్దకోడలు కూడా ఆహ్వానించింది అత్తగారిని రమ్మని!... కొన్నాళ్ళపాటయినా లక్ష్మి సుఖంగా ఉంటుంది కదా అన్న ఆశతో, తల్లిని వెళ్లమని ప్రోత్సహించాడు చిన్న కొడుకు. ఏమయినా చిన్నకోడలి దగ్గర తను మసలలేనన్నే కారణంచేత, రుద్రాక్షమ్మ 'గోమో' వెళ్ళిపోడం తటస్థించింది.

"రెండోకోడలి బాధ పడలేక, ఆ మహా సాధ్వి రుద్రాక్షమ్మగారు పెద్దబ్బాయి దగ్గరి కెళ్ళిపోయేరు." అని అమ్మలక్కల సమావేశంలో అనుకున్నారు. ఆ ఊరివాళ్ళ దృష్టిలో లక్ష్మి మహా పాపిష్టిదానిలా పరిగణించబడింది. "ఇదంతా పూర్వజన్మ సుకృతం" అని లక్ష్మి వేదాంతమార్గంలోకి పోయి సమాధాయించుకొనేది.

ఇప్పుడు లక్ష్మిజీవితంలో కొన్ని బాధలు తప్పాయి!... మునపటికన్నా ఎంతో హాయిగా కాలక్షేపం చేస్తున్నదనక తప్పదు. కామయ్యతో సరదాగా కాలక్షేపం చేస్తున్నది లక్ష్మి!

"ఇప్పుడసలురోజూ కోమూ రైనా స్నానం చేస్తున్నాదా? అసలు మడిపంచంటూ ఓటి, ఉంటున్నదా?" అని నవ్వుతూ అడిగేడు కామయ్య.

"ఊఁ... మీకంత వేళాకోళంగా ఉందన్న మాట! అబ్బ!... ఆవాసన ఇంకా పూర్తిగా పోలేదు. ఇప్పటికీ మంచాల్నీ, వాటినీ ముట్టుకుందుకు దడుస్తూఉంటాను మళ్లీ స్నానం చెయ్యవలసొస్తుందేమోనని!" ఆ మాటలు అని నవ్వుతూ నాలుక కరచుకుంది లక్ష్మి.

"అబ్బో!... మాట్లాడ్డమే మరిచిపోయే వనుకున్నాను. మళ్ళీ నువ్వు పూర్వపు లక్ష్మి వయ్యావ్." అన్నాడు కామయ్య.

ఇంతలో, వీధి తలుపు చప్పుడయింది. టపాబంట్రోతు ఓ ఉత్తరం తీసుకొచ్చి ఇచ్చేడు. ఆత్రుతతో చదివేడు కామయ్య.

"ఎక్కడినుంచి?" అడిగింది లక్ష్మి.

"మా అన్నయ్యదగ్గరనుంచి. మాఅమ్మకు జబ్బుగా ఉందట! పక్షవాతంలా ఉందట!.. మా వదినెకు సరిగ్గా సంరక్షణ చేయడం చేతకాదట. అంచేత మనల్ని రమ్మని వ్రాశాడు. లక్ష్మిని.. చూడాలని ఉందని మాటిమాటికీ అంటున్నదటఅమ్మ" అప్రయత్నంగా కామయ్య కళ్లవెంబడి నీళ్లు కారేయి!

"అయ్యో! అలాగటండీ, అయితే మనం త్వరగా వెళదాం!" అంది లక్ష్మి.

మర్నాడే బయలుదేరి వెళ్లారు. గుమ్మంలో కాలుపెడుతూనే, "అమ్మా!...మట్లాపేవూ? అయ్యో!... ఇదేమిటిలా అయిపోయేవు" అంటూ అమ్మచేతులు పట్టుకొన్నాడు కామయ్య!... "అత్తగారూ, ఇదంతా ఏమిటండీ, అయ్యో!... ఇదేం గ్రహచారమండీ?" ఆందోళనతో అంది లక్ష్మి. పెర్రిగా చూడ్డం మొదలుపెట్టింది రుద్రాక్షమ్మ. కళ్లంట నీరు ధారగా కారుతున్నది.

"మరే కాతుంది! అయినా మరీ అంత చాదస్తమా! అందుకే ఇదంతా. లేకపోతే ఇష్టం వచ్చినప్పుడల్లా స్నానంచేస్తూ, చీటికీ మాటికీ అందర్నీ తిడుతూఉంటే ఏమవుతుంది?" అంది పెద్దకోడలు కమల ప్రక్కనే నిలబడి.

"ఊరుకోం డక్కయ్యా. ఇలాంటిసమయంలోకూడా అవేం మాటలు?" అంది లక్ష్మి.

"ఓ!.. మహా అభిమానం దొర్లుకొచ్చింది. చాల్లే నువ్వూరుకో!" అంటూ విసవిసా గదిలోకి వెళ్ళిపోయింది కమల.

లక్ష్మివైపు దీనంగా చూచింది రుద్రాక్షమ్మ!... ఏదో మాట్లాడదామని ప్రయత్నిస్తున్నది కాని నోటంట మాట రాలేదు. ఆఖరి. కెలాగో "ల...క్ష్మి..." అనేసరికి దుఃఖంలో మాటరాలేదు.

"ఏమండీ!... త్వరగా మనూరు తీసుకుపోదాం. అక్కడ ఏమయినా ఆయుర్వేదం మందులు ఇప్పిస్తే, మళ్ళీ కాలూ, చెయ్యీ వస్తాయేమో! ఇక్కడ సరిగ్గా చూచేవారే లేరు." అంది లక్ష్మి భర్తతో!

కోడలువైపు దీనంగా చూచింది, రుద్రాక్షమ్మ. తర్వాత గట్టిగా కళ్లుమూసుకుంది రుద్రాక్షమ్మ. కళ్లలో నీరు పూర్తిగా అయిపోతుందని కాబోలు ఆమె భయం!

సర్వోత్కృష్టమైన

"కానన్ దేవన్"

టీ మాత్రమే త్రాగండి.

Kanan Devan Tea

Quality Production

చీఫ్ ఏజంటు: కర్నూలు, అనంతపురం, కడప & చిత్తూరు జిల్లాలకు

కె. ఎ. జోషి, అనంతపురం.

టోకు వ్యాపారస్తులకు విశేష సౌలభ్యము

వివరములకు నేడే వ్రాయండి.